# క్యూ

పెద్ద క్యూ- ప్రయాణం చేసితీరాలి.

"శ్రీరంగం నారాయణబాబుకు– బ్రహ్మసమాజ మందిరంలో సన్మానం... వచ్చి తీరాలి."

కృష్ణశాస్త్రిగారి ఫర్మానా -

నా కోసం వచ్చిన కుర్రాడు మంచి చురుకైనవాడు. ఎట్లాగో రెండు టిక్కెట్లు సంపాదించి... బస్సులోకి నన్ను గిరవాటేసి - తను ఒకచోట ఇరికాడు.

నేను ఆడవాళ్ళ సీటు పక్క పడ్డాను. నెమ్మదిగా ఉత్తరకాయం ఇది వరకే కూర్చున్న వాళ్ళ మధ్య ఇమిడ్చి కిటికీలోంచి చూశాను.

క్యూ తెగిపోయింది.

బస్సు బయలుదేరింది.

ఇంగ్లీష్‌అక్షరాల్లో 'క్యూ' అంటే నాకుసరదా, అంటే చాలదు చాలా యిష్టం- ఎందుచేతనంటే వాటి శూన్యమైన సున్నకు కింద చిన్న ములికి తగిలిస్తే దానికి ప్రాణం వచ్చి కదలడం ప్రారంభిస్తుంది.

నేను చూసిన క్యూ వర్ణక్రమంలో వేరైనా అసలక్షరం జ్ఞాపకం వచ్చింది.

Q cannot go without "u"

అది ప్రేమకు స్నేహానికి చిహ్నం.

ప్రకృతి పురుషుల లీలా ఖేలనం!

అది వొంటరితనాన్ని సహించదు.

మనసు వేరొక మనస్సును కోరుతుంది.

పాపం క్యూ ఇంకో అక్షరాన్ని తనతో వుండమని బతిమాలు తుంది.

"కాకినాడా ?"

తల తిప్పి చూశాను. ఆడవాళ్ళ సీటులో మధ్యనుంచి ఒక కల కంఠం. మనసులో ఉలికిపడ్డాను. కంఠం గుర్తించటానికి వెతుకుతున్నాను.

ఇంకా ప్రశ్నార్థకం ముఖంలో, ఆరని ముద్దబంతిపువ్వు లాంటి ముఖం కనిపించింది.

కమలాలయా ?

శిరీషా ?

కాదు. సుబ్బలక్ష్మీ! సుందరమ్మో అయివుండాలి. కాలేజీ గాలి ఏమి కనిపించడం లేదు.

అచ్చపు పల్లెటూళ్ళో పుట్టి పెరిగిన సంపెంగ పువ్వు.

కళ్ళ మెరపు. చెంపల నునుపు. ఆరోగ్యమైన శరీరం పట్టణాన్ని జ్ఞాపకం రానివ్వడం లేదు.

ఆకుపచ్చని చేలను, కమ్మని గాలిని, దొంగ చూపు నెరగని నిర్మల మానవత్వాన్ని తలపులోకి తెస్తున్నాయి.

ఒరుగులు, ఒయ్యారాలూ, లేకుండా నిటారుగా కూర్చుంది. పుచ్చ పువ్వు లాంటి చిరునవ్వుతో అంది "మీ చేతిలో పుస్తకం చూస్తే మీ రెవరో తెలిసింది. ఆశ్చర్య పడకండి. నన్ను మీరెరగరు. మాతమ్ముడు మిమ్మల్ని గురించి చెబుతూంటాడు. పుస్తకంమీద మీ పేరు చూశాను."

అప్పుడు నా చేతిలోని పుస్తకం మాట జ్ఞాపకం వచ్చింది.

ఆరోజు మధ్యాహ్నం సాహిత్య ప్రియుడయిన మిత్రుడొకడు తన ఇంట్లో సాహితీగోష్ఠి పెట్టి కొత్తగా వచ్చిన "శివభారతం" చదవమన్నాడు.

కావ్యపఠనం, కవితాచర్చ, హుషారుగా సాగాయి.

ఇంటికైనా వెళ్ళకుండా సరాసరి ప్రయాణానికి సిద్ధమైనాను.

పుస్తకం చూడాలనే కాంక్ష ఆమె కళ్ళల్లో కనపడింది.

అరమరికలేని ఆ చనువుకు ఆశ్చర్య పడ్డాను.

పల్లెటూళ్ళలో పెరిగినా, తిరిగినా, పట్నవాసపు సంపర్కాలూ, నాగరికతా ప్రలోభాలూ, కృత్రిమ మందహాసాల వెలితీ- ఈ మనసులోని సహజ స్వచ్ఛతను చంపి వేశాయి గాబోలు.

యువతియైన ఆడది నిర్మొహమాటంగా పలకరిస్తే ఈ మనస్సు తట్టుకోలేకపోతోంది.

పుస్తకం యిచ్చాను. నిరభ్యంతరంగా పుచ్చుకుంది.

అక్కడక్కడ పేజీలు తిరగేసి, చదివి విప్పారిన కళ్ళతో ఆనందించింది. అర్థంకానిచోట కనుబొమ్మలు విరిచి ఆలోచిస్తోంది.

సీతను చూడలేదు.

అనసూయను దర్శించలేదు.

మైత్రేయి ఎట్లా వుండేదో తెలియదు.

ఋషికన్యలెట్లా వుండేవారో ఊహకు కూడా అందరు.

ఆ చిరంతన స్త్రీత్వ మాధుర్యానికి, హృదయ లాలిత్యానికి, ఈ స్త్రీ మూర్తి చిహ్నమా ?

ఈ ఔదార్యం, మాధుర్యం మగజాతిని బుజ్జగించకపోతే, వీళ్ళు ఏమయ్యేవారో ?

ఆమె కుమారో, శ్రీమతో తెలియదు.

ఎందుకూ తెలియడం ?

ఆ క్షణం హృదయంగమం! ఆ పరిచయం మధురం; ఆ దర్శనం ఒక వరం.

ఆ తృప్తిచాలు కొన్నేళ్ళు తలుచుకోడానికి - పుస్తకం కృతజ్ఞతా సూచకంగా నవ్వి ఇచ్చివేసింది.

స్త్రీ తల్లిగా లాలించింది.

చెల్లిగా ఆడింది.

చెలిగా మనస్సును తియ్యదనంతో నింపింది.

దేవిలా తలపై అభయహస్తం ఉంచింది.

చల్లగా అదృశ్యం అయింది.

మధ్య ఒక జంక్షన్‌లో బస్సు ఆగింది.

"నే నిక్కడ దిగి మావూరు వెళ్ళాలి" అని చిరునవ్వుతో దిగి, పొడుగాటి మట్టిరోడ్డుమీద నడుస్తూ వెళ్ళిపోయింది.

ఆమె పుస్తకం తెరచి వెనక్కి ఎందుకో తిరిగి చూచినప్పుడు

గాబోలు జడలోని రెండు గులాబీరేకలు మధ్యపేజీలలో పడి వదలని జ్ఞాపకాలు నిలిచిపోయాయి! 'క్యూ'ని విడిచిన "యు" లాగ.

O O O

పి. ఆర్. కాలేజీ ఎదుట బ్రహ్మసమాజ మందిరంలో సన్మానసభ బ్రహ్మాండంగా ప్రారంభమయింది.

శాస్త్రిగారు అధ్యక్షులు. నారాయణబాబు నుగ్గులు తేరిన గిరజాలు చెవులమీదుగా దువ్వుకుని, పొడుగు లాల్చీ తొడిగి, కృష్ణశాస్త్రిగారి ప్రతిబింబంలా పక్కన కూర్చున్నాడు. నారాయణబాబుతో ఇరవై ఏళ్ళనాటి పరిచయం నాకు. ముందు కవిత్వమో, గిరజాలో, నాకు అంతుపట్టలేదు. నేను చూసేనాటికి రెండూ స్థిరపడి వున్నాయి.

కృష్ణ శాస్త్రిగారు గీత పద్యం ఫాషన్ చేసిం తర్వాత కవిత్వం ప్రారంభించాడు. కుర్రకారంతా గీతంమీద పడింది. ఇతడు చాలా గీత పద్యాలు రాసినా మోజు గేయం మీద. మంచి కంఠం. బాగా పాడేవాడు. ఆతని "మిణుగురుల" పాట యిప్పటికీ నా చెవుల్లో గింగురు మంటుంది. బుగ్గలు పూరించి వేణువు వూదినట్టు పాడేవాడు. పచ్చి భావకవిత్వం: నాకు చాల బావుండేది ఆ రోజుల్లో —

విజయనగరంలో, చిన్నాంజనేయస్వామి కోవెలపక్క అయ్యకోనేటి ఒడ్డున మా సాహిత్యాశ్రమం. లౌక్యం ఎరుగడు. వట్టి భోలా భావ—

మా కాలేజీకి సెలవు రావడం తడువు - వెంటనే నారాయణబాబు దగ్గర వాలేవాడను. ఇతడు ఇంకెక్కడైనా వాలితే - ఆ పుణ్యాశ్రమం కనుక్కొని - అతన్ని పట్టుకుని కోనేటి ఒడ్డుకు చేరేవాళ్ళం. అది వేరేకథ— రావ(ప్పంతు లన్నట్టు—

శాస్త్రిగారికి, నారాయణబాబు అమాయకత్వం మీద, నిజాయితీమీద బాలా ఇష్టం.

కవిత్వంమీద ఎంతవరకు ఇష్టమో ఆ బ్రహ్మకు తెలియాలి.

కాకినాడలో నారాయణబాబు కొన్నాళ్ళు 'క్యూ'ని 'యు', లాగ కృష్ణశాస్త్రిగారిని వదలకుండా తిరిగేవాడు. భగవద్గీతలో "తిష్ఠన్, జిఘ్రన్, శ్వసన్" అన్నట్టు.

అసలు కృష్ణశాస్త్రిగారే క్యూ లాంటి మనిషి. ఏదో ఒక'యు' వెంట వుంటేకానీ కదిలేవారు కారు.

ఇంటి దగ్గిరా అంతే —

ఎవరో ఒకరు కబుర్లు చెబుతూ, విడవకుండా వుండాలి. కవిత్వం, టాగోరు, ఉపనిషత్తులు గురించి ఆయన అనర్గళంగా చెప్పేది వింటూ— Queue లా వుండేవారు కొందరు.

అందులో చాలామంది కాలేజీ విద్యార్థులు. ఆగంతుకులు — విద్యార్థులు, ఆయన చూపుడువేలు ఎటు తిప్పితే అటువైపు పరుగెత్తడానికి సిద్ధంగా వుండేవారు.

ఒక సుముహూర్తాన ఆయనకు నారాయణబాబుకు సన్మానం చేయించాలని తోచింది.

డబ్బు కావాలి, కనీసం నూట పదహార్లు.

ఈనాడు అంతమాత్రం లెక్కలేదుగాని – ఆ రోజుల్లో దానికే

పెద్ద ప్రయత్నం చేయవలసి వచ్చేది. కాని యువశక్తి పూనుకుంటే కొండల్ని పిండికొట్టి, ఎగరబోయగలదు!

లెక్కలేకుండా నాలుగు రోజులలో నూటపదార్లూ, పై కర్చుకు మరికొంతా సంపాదించి యెదుట పెట్టారు విద్యార్థులు.

శాస్త్రిగారు అప్పుడు కాలేజీలో వుద్యోగం చేస్తూన్నట్టు జ్ఞాపకం.

కాలేజీకి యెదుట బ్రహ్మసమాజ మందిరం; సభాజనంతో కిటకిట లాడుతోంది. లెక్చరర్లు, నగరవాసులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో హాజరయారు.

నారాయణబాబును బాగా యెరిగిన వారిని వొకరిని పిలవా లన్నారట. అర్ధ రూపాయ దూరంలో నేను కనపడ్డాను. కబురంపారు.

శాస్త్రిగారు ఆ రోజున నారాయణబాబును గూర్చి అద్భుతంగా మాట్లాడారు. అతని కవితలోనుంచి "చీకటి శరీరంమీద ఒకటి రెండు వెలుతురు గాయాలు" అన్న మాటలు కోట్ చేస్తూ, ఆమాటలు నేనెన్నడూ మరచిపోలే నన్నారు.

నిజంగా గొప్ప పంక్తులు-

శాస్త్రిగారిచ్చిన ఊపుతో మిణుగురుల పాటనుంచి కోట్ చేస్తూ, అతని కవ్విత్వం గురించీ, మా పరిచయం గురించీ, విజయనగరం జ్ఞాపకాల గురించీ, నేనూ ప్రసంగించాను.

సభ్యుల వికసిత వదనాలు చూసి నాకు తృప్తికలిగింది.

వారికి "థాంక్యూ" అనడం కంటె ఇంకేమనగలను ?